# కథ

# ఇది హైదరాబాదే బామ్మా!

## ఎస్.ఇందిరా నాగేశ్వర్

"బామ్మా! బామ్మా!" కోపంగా అరిచాడు బాచి ఉరఫ్ భాస్కరం. బామ్మ ముద్దుగా 'బాచీ' అనే పిలుస్తుంది.

"ఏమిట్రా బాచీ! ఏమైంది? అలా అరిచావు?" అంటూ కంగారు పడ్తూ వచ్చింది బామ్మ.

"ఏమైందా! చూడు..ఇక్కడెన్ని నీళ్ళున్నాయో! కొంచెమైతే జారిపడేవాడ్ని. నిన్నంతా గదులు దులిపావు, దాంతో నాకు ఒకటే తుమ్ములు. ఈరోజు గదులు కడిగావు, ఎక్కడ చూసినా నీళ్ళే. అయినా ఈ వయసులో నువ్వు హైరానా పడ్తూ, నన్ను ఇబ్బంది పెడ్తూ ఎందుకే నీకీ పనులు? హాయిగా కృష్ణా రామా! అంటూ విశ్రాంతిగా కూర్చోక" విసుక్కున్నాడు బాచి.

"రేపు పండగ పెట్టుకుని ఇల్లు దులపకుండా, కడక్కుండా ఎలారా! పండుగల పేరుతోనైనా ఇల్లు శుభ్రం చేసుకుంటారనే ఈ పద్ధతులన్నీ పెట్టారు మరి. ఎన్నాళ్ళ నుంచి మురగబెట్టారోగానీ నిన్న దులిపితే ఎంత దుమ్ము, చెత్తా వచ్చాయో నువ్వు కూడా చూసావు కదా! ఈ రోజు కడిగితే కూడా ఎంత మురికి వచ్చిందో. ఇల్లు శుభ్రం చేసుకోకపోతేనే ఆరోగ్యాలు పాడయ్యేది. కాస్త ఇబ్బందైనా శుభ్రాలు చేసుకోకతప్పదు అందుకనే. అయినా నీ గదిలో కూర్చోక ఈ నీళ్ళల్లో తిరగడమెందుకు? పూర్తిగా తుడిచేలోగానే కంగారుపడిపోతావు" అంటూ గుడ్డతెచ్చి నీళ్ళు తుడవసాగింది బామ్మ.

"నాకేమీ తోచట్లేదు. నువ్వేమో ఎప్పుడూ ఏదో పని అంటూ నా దగ్గర కాసేపైనా కూర్చోవు. నరేష్, గిరి కూడా లేక నాకు చాలా బోర్‌గా ఉంది. తోచక అటూ ఇటూ తిరుగుతుంటే తిరుగుతుంటే 'ఇక్కడ కూర్చోకు, అక్కడ పడుకోకు' అంటూ నన్ను స్థిమితంగా ఉండనీయవు. అయినా ఇది హైదరాబాదే బామ్మా! చేబ్రోలు కాదు. నీ ఆచారాలు, పూజలు చూసి అందరూ నవ్వుకుంటారే. అంటే వినిపించుకోవు. ఇది బ్యాచిలర్స్ హౌసే! ఇందులో ఇవన్నీ ఎందుకు..వద్దు మొఱ్రో అన్నా వినకుండా నన్ను విసిగిస్తున్నావు" అన్నాడు బాచీ కోపంగా.

"ఏం చేయమంటావురా నాయనా! నే పుట్టినప్పటి నుంచీ ఉన్న అలవాట్లు. ఇంత బతుకూ బతికి ఇప్పుడు గంగలో కలపమంటావా ఏమిటీ? నా అలవాట్లు నావి. అయినా నన్ను చూసెందుకు నవ్వుతార్రా? నా పనేమిటో నేను చేసుకుంటున్నాను. ఎవరేమనుకున్నా నేను పట్టించుకోను. మీరు బాచీల్రో ఏదో అన్నావే, అయితే మాత్రం, ఆకాశాన్నుంచేమైనా ఊడిపడ్డారా! నిన్న మొన్నటి వరకూ నువ్వు కూడా తుండుగుడ్డ చుట్టుకుని నా వెనకాలే తిరుగుతూ పూజలవీ చేసినవాడివి కాదా! ఇప్పుడు పట్నం వచ్చేసరికి బడాయి కూతలన్నీ కూస్తున్నావు కానీ. పట్నంలో ఉన్న వాళ్ళు మాత్రం శుభ్రాలు చేసుకోరా? పూజలు చేసుకోరా?" అని బాచీనే నిలదీసింది బామ్మ.

"బాబోయ్ నీతో వాదించడం నా వల్ల కాదు కానీ బాబాయికి ఫోన్ చేస్తానుండు, వచ్చి నిన్ను తీసుకుపొమ్మని" అనాడు బాచి.

"వాడొచ్చినా, నేను వెళ్ళేది లేదు. నీకు పూర్తిగా తగ్గేవరకే కాదు, కొన్నాళ్ళ పాటు ఇక్కడే ఉందామనుకుంటున్నా. అక్కడికెళ్ళి మాత్రం నేను వెలగబెట్టే రాచకార్యాలేమున్నాయి గనుక. ఇక్కడైతే నా చేత్తో నీకింత ఉడకేసి పెడ్తున్నానన్న తృప్తైనా ఉంటుంది. ఇన్నాళ్ళూ పట్నం అంటే భయపడి ఇక్కడకు రాలేదుగానీ, ఇక్కడకొచ్చాక ఇప్పుడు నాకా భయం పోయింది. వీళ్ళూ మనలాంటి మనుషులే కదా" అంది బామ్మ ధీమాగా.

"హతోస్మి, చచ్చాన్రా దేవుడా! ఈవిడకు పట్నం నీళ్ళు బాగా వంటబట్టినట్టున్నాయి. ఏకై వచ్చి మేకై కూర్చుంది" అని సణుక్కున్నాడు బాచి.

"ఏమిట్రా అంటున్నావు?" అని గట్టిగా అడిగింది బామ్మ.

"ఏమీ లేదు లేవే. నీకిష్టమొచ్చినన్నాళ్ళు ఉండు. కానీ నీ ఛాదస్తాలతో నన్ను మాత్రం చంపకు" అని నీరసంగా అంటూ తన గదిలోకి వెళ్ళిపడుకున్నాడు.

"పిచ్చి సన్నాసి. అనవసరంగా వాగి నీరసం తెచ్చుకున్నాడు. పోనీ హార్లిక్స్ అన్నా కలిపిద్దామనుకుంటూ" వంట ఇంటివైపు నడిచింది బామ్మ. స్టౌమీద పాలు పెట్టి ఆలోచనలో పడింది. రేపు వినాయక చవితి పండుగని ఇల్లు శుభ్రం చేస్తుంటే ఏదీ వద్దంటాడు. ఏ హడావుడీ వద్దు గోడకున్న ఫోటోకు దణ్ణం పెట్టుకో చాలంటాడు.. అసలే సుస్తీ చేసి కోలుకుంటున్నవాడు అనవసలసిన మాటలేనా ఇవి? ఆ దేవుడి దయవలన ఇవాళిలా లేచి తిరగ గలుగుతున్నాడు. అసలే విఘ్నేశ్వరుడు. ఆయనను ప్రసన్నం చేసుకోకపోతే ఎన్ని విఘ్నాలు కలుగుతాయో అన్న భయం కూడా లేదు వీడికి. ఇవన్నీ ఈ కుర్రకారుకి ఎప్పటికి అర్థం అవుతాయో. మిడిమిడి జ్ఞానంతో అంతా మా గొప్పతనమే అని విర్రవీగుతారు కానీ ఆ దేవుడి దయ లేనిదే ఏదీ సాధ్యం కాదని ఎప్పుడు తెలుసుకుంటారో! పెద్దవాళ్ళేమైనా చెప్పినా, చేసినా వీళ్ళకు ఛాదస్తాలుగానే కనిపిస్తాయి అనుకుంటూ కాచిన పాలు దింపి హార్లిక్స్ కలిపింది. వేరే ఇంకో గ్లాసు తీసుకుని తౌరుపుతూ బాచీ గదిలోకి వచ్చింది బామ్మ.

బాచి మంచి నిద్రలో ఉన్నట్లుగా సన్నగా గురక వినిపిస్తోంది. నిద్రలో ఉన్న మనవడి ముఖం వంక ఒకసారి తేరిపార చూసింది బామ్మ.

'పిచ్చికన్న ఎంత చిక్కిపోయాడో. మాయదారి టైఫాయిడ్ వచ్చి చచ్చి బతికినంత పనయ్యింది. బాచీ వద్దని చెప్పినా వినకుండా నరేష్ ఫోన్ చేయబట్టి తెలిసిందిగానీ లేకపోతే బిడ్డ ఏమైపోయేవాడో తల్చుకుంటేనే భయమేస్తుంది. వెంటనే చిన్నబ్బాయితో రావడం మంచిదే అయింది. పథ్యం పెట్టాక 'నాకు తగ్గింది కదా! బాబాయ్‌తో వెళ్ళిపో బామ్మా..నీకిక్కడ ఇబ్బంది' అని బాచీ గొడవపెట్టినా, 'నువ్వు పూర్తిగా కోలుకునేవరకూ నేను వెళ్ళననే సరికి' చిన్నబ్బాయి వెళ్ళిపోయాడు. తల్లీతండ్రీ చిన్నప్పుడే చనిపోతే ఇన్నాళ్ళూ ఆలోటు తెలీకుండా పెంచి ఇంతవాడ్ని చేసాను. ఇప్పుడు వీడిలా ఉంటే వదిలి ఎలా వెళ్ళగలను? ఇంజనీరింగ్ చదివాడు, మంచి ఉద్యోగం లోనూ స్థిరపడ్డాడు. ఇక మంచి పిల్లను చూసి పెళ్ళి జరిపించేస్తే వీడి మంచీ చెడ్డా ఆ పిల్లే చూసుకుంటుంది. హోటల్ తిండి తిని ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నాడు. సంబంధాలు చూడమని చిన్నబ్బాయికి చెప్పాలి' అనుకుంటూ వంట యింటివైపు నడిచింది బామ్మ.

○○○

బాచి, నరేష్ ఒకే ఊరివారు. చిన్నప్పటి నుంచీ కలిసి చదువుకున్నారు. ఆ స్నేహం ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. నరేష్ తమ్ముడు గిరి. నరేష్ జాబ్ ట్రయల్స్‌లో ఉన్నారు. గిరి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సింగిల్ రూమ్‌లో ఇరుకుగా ఉండటం నచ్చక డబుల్ బెడ్‌రూమ్ హౌస్ అద్దెకు తీసుకుని ముగ్గురూ షేర్ చేసుకుని ఉంటున్నారు. ఇరువురూ డబ్బుకు లోటు లేని కుటుంబాల నుంచే రావడం వలన ఏ సమస్యలూ లేవు. రెండు బెడ్‌రూమ్‌లతోబాటు ఓ హాలు, కిచెన్


కూడా ఉండటం వలన బామ్మకు ఆ ఇల్లెంతో నచ్చింది. బామ్మ వచ్చీరాగానే చిన్నబ్బాయికీ, నరేష్‌కీ చెప్పి కావాల్సిన సామాన్లన్నీ తెప్పించుకుంది. క్రింద ఫస్ట్ ఫ్లోర్‌లోనే ఓ సూపర్ మార్కెట్ ఉండటంతో ఆమెకు కావాల్సిన సరుకులు, కాయగూరలు, పళ్ళు నరేష్, గిరి క్షణాల్లో తెచ్చిస్తున్నారు. నరేష్ వాళ్ళది వేరే కులమని మొదట్లో బామ్మ కొంత అసౌకర్యంగా భావించినా, వారి సహాయ సహకారాలూ, తన మడీ ఆచారాలకు భంగం కలిగించని వారి నడవడి బామ్మకు నచ్చాయి. వారికీ తన మనవడితో సమంగా వండిపెడుతుంటే వారూ మరింత కృతజ్ఞత చూపిస్తున్నారు. పండుగ సందర్భంగా వారిద్దరూ ఊరు వెళ్ళడంలో బామ్మకు కాస్త ఇబ్బందిగానే ఉంది. క్రింద షాపు కెళ్ళి రావడం, లిఫ్ట్ ఆపరేట్ చేయడం లాంటివి నరేష్ నడిగి తెల్సుకుందిగానీ, పూజ కోసం ప్రతిమ, పత్రి, పూలు తెచ్చేవాళ్ళెవరూ లేరే అని ఆవిడకు బాధగా ఉంది. బాచీని సలహా అడుగుదామంటే ఎక్కడ విరుచుకుపడతాడో అని భయపడ్తోంది. క్రింద షాపునకు వెళ్ళి కావాల్సిన సరులన్నీ తెచ్చుకుంది. పూజ సామాన్లన్నీ సిద్ధం చేసి పెట్టుకుంది. "ఇక మిగిలినవన్నీ సమకూర్చే భారం నీదే తండ్రీ నీ పూజను నువ్వే సక్రమంగా జరిపించుకో" అని వినాయకుడ్ని మనసులో తలుచుకుంటూ నిద్రలోకి జారుకుంది బామ్మ.

○○○

లీలగా మంత్రోచ్చారణ వినిపిస్తుంటే బాచీకీ మెలకువ వచ్చింది. అగర ధూపాల పరిమళం ఇల్లంతా గుబాళిస్తోంది. "అప్పుడే తెల్లవారిందా? బామ్మ పూజ కూడా చేసేస్తున్నట్లుంది" అనుకుంటూ దుప్పటి పక్కకు తీసి లేచాడు బాచి. "పేపర్ వచ్చి ఉంటుంది" అనుకుంటూ వీధి గది వైపు నడిచాడు. వీధి తలుపు తీయగానే గుమ్మానికి కట్టిన తోరణాలు, పూల దండలు బాచీకి స్వాగతం పలికాయి. గుమ్మం ముందు తీర్చిదిద్దిన చక్కనైన పద్మం ముగ్గు బాచీకి శుభాకాంక్షలు చెబుతోంది. ముగ్గు పక్కన పడి ఉన్న పేపరు తీసుకుని లోపలకు వస్తూ 'బామ్మకెంత ఓపిక! ఈ వయసులో కూడా ప్రతి పనీ పెర్‌ఫెక్ట్‌గా చేస్తుంది' అని బామ్మను మెచ్చుకో




కుండా ఉండలేకపోయాడు. మంత్రముగ్ధుడిలా మంత్రాలు వినిపిస్తున్న వంటయింటి వైపు నడిచాడు. అక్కడ ఓ పీటపై వినాయకుడి విగ్రహం, పైన మామిడాకులతో, పూలతో, పండ్లతో అలంకరించిన పాలవెల్లి కటికట ఉంది. మండపమంతా కళకళలాడుతూ కనిపిస్తోంది. దేవుడి ముందు కుడుములు, పాలతాలికలు, పులిహోర వంటి పిండి వంటలున్నాయి. బామ్మ ఒక చేత్తో పుస్తకం పట్టుకుని చదువుతూ, మరో చేత్తో దేవునిపై పత్రి వేస్తూ పూజా విధులను సక్రమంగా ఆచరిస్తోంది. నూనె దీపాల కాంతిలో తెల్లని వినాయకుడు, వెనకాల ఛత్రం ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ బామ్మకు ఎవరు తెచ్చిఉంటారు?' అనుకుంటూ బామ్మ పూజకు ఆటంకం కలిగించకుండా అక్కడి నుంచి వచ్చేసాడు బాచి. 'మొత్తానికి బామ్మ ఏదైనా అనుకుందంటే సాధించి తీరుతుంది' అని నవ్వుకున్నాడు.




## గడసరి దీపిక

ఒకప్పటి ప్రపంచ బాడ్మింటన్ చాంపియన్ ప్రకాష్ పదుకొనే కూతురు దీపికా పదుకొనే తన తొలిచిత్రం 'ఓం శాంతి ఓం' విడుదలకు ముందు నుంచీ వార్తల్లో వ్యక్తి అవుతోంది. మొదటి సినిమాలోనే షారుఖ్‌కి జోడీగా నటిస్తున్న ఈ ముద్దుగుమ్మ ధోనీ, యువరాజ్‌ల చుట్టూ తిరుగుతూ పబ్లిసిటీ సంపాదిస్తోంది. అయితే తనకి వాళ్లతో ఎలాంటి పర్సనల్ అనుబంధాలు లేవని కొట్టిపారేస్తున్న దీపిక తనకి క్రికెట్ అంటే వున్న వల్లమాలిన అభిమానం వల్లనే తను వాళ్లకి దోస్తునయ్యానంటోంది. ఏదేమైనా సినిమా తారగా బాగా రాణించగలదు దీపిక- అని సినీజనాలు అంచనాలు వేస్తున్నారు.



పేపర్ చదువుతూ 'బామ్మ పూజెప్పుడౌతుందా! కాఫీ ఎప్పుడిస్తుందా?' అని ఎదురు చూస్తున్నాడు. హారతిస్తున్నట్లు గంట మోత వినిపించింది.

కాస్సేపటికి బామ్మ ఆ గదిలోకి వచ్చింది. "లేచావా, బాచీ! నీరసం తగ్గిందా నాన్నా" అంటూ అడిగింది.

"లేచి చాలా సేపే అయింది బామ్మా! నీ పూజ అయ్యాక కాఫీ ఇస్తావని చూస్తున్నాను ఇందాకటి నుంచీ" అన్నాడు.

"అయ్యో! అయ్యో! పండగపూట, పరగడుపున, అదీ పాచి మొహంతో కాఫీ ఏమిట్రా? ఇటువంటివన్నీ ఎలా అబ్బాయిరా నీకు? లేచి ముందు మొహం కడుక్కో. నీళ్ళు కాగి ఉన్నాయి. తలస్నానం చేసి దేవుడికి కొబ్బరికాయ కొట్టు. ఆ తర్వాతే కాఫీలు, టిఫిన్లు" అంటూ దండకం చదివేసింది బామ్మ.

ప్రొద్దుటే బామ్మతో వాదులాడే ఓపిక లేక "అలాగే లేవే" అంటూ పేపర్ పక్కన పడేసి, నీరసంగా మూల్గుతూ లేచాడు బాచి.

బాచి స్నానం చేసి వచ్చేసరికి బైట సందడిగా మాటలు వినిపిస్తున్నాయి. "ఎవరో వచ్చినట్లున్నారే" అనుకుంటూ షర్ట్ వేసుకుని బైట గదిలోకి వచ్చాడు బాచి.


అక్కడ కొంతమంది ఆడవాళ్ళున్నారు. బామ్మను ఏవేవో ప్రశ్నలడుగుతున్నారు. బామ్మ నవ్వుతూ ఓపికగా వారికి సమాధానాలు చెబుతోంది.

"బామ్మగారూ! పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు పట్టుగొమ్మలంటారు కదా! కానీ వాటిని ఇప్పుడు ఛాదస్తంగా భావించేవారు ఎక్కువై, భక్తిశ్రద్ధలతో ఆచరించేవారు తక్కువైపోతున్నారు. అసలు పండుగలు చేసుకోవడం వలన మనకేదైనా ఉపయోగం ఉందంటారా? దాని గురించి మీరేమైనా చెప్పగలరా?" అని ఒకదావిడ బామ్మను అడుగుతోంది.

'బామ్మేదో వి.ఐ.పి.లాగా, వీళ్ళేమో యాంకర్ల లాగా ఏమిటీ ప్రశ్నలు?' నవ్వొచ్చేస్తోంది బాబీకి. బామ్మేం సమాధానం చెబుతుందా అని బాచీ కూడా ఆసక్తిగా బామ్మ వంకే చూస్తున్నాడు.

"నేనేమీ పెద్దగా చదువుకోలేదమ్మా! ఏదో చదవడం, రాయడం మటుకు వచ్చు. నాకు తెల్సినంత మటుకు చెబుతాను" అంటూ బామ్మ చెప్పసాగింది. "పండుగలు మండుటెండల్లో నీడనిచ్చే చెట్ల లాంటివి అనుకుంటాను నేను. చెట్ల నీడన విశ్రాంతి పొందినట్లుగా, పండుగనాడు కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో గడపడం ఆనందోత్సాహాలను కలిగిస్తుంది. దాని వలన జీవితంలో నూతనోత్సాహం వెల్లివిరుస్తుంది. మనం ఒంటరివారం కామని పండుగలు మనకు గుర్తుచేస్తుంటాయి. పండుగలు మన సంప్రదాయాలను నిలబెట్టడమే కాక ఆరోగ్యపరంగానూ మేలు చేకూరుస్తాయి. పండగ పేరు చెప్పి ఇల్లు పరిసరాలు శుభ్రం చేసుకుంటాము. అందువలన రోగాల బారినపడకుండా ఉంటాము. పూజలలో వాడే పసుపు, కుంకుమ, గంధం క్రిమి సంహారకాలుగా పనిచేస్తాయి. సాంబ్రాణి, అగరధూపాల పొగ ఈగలను, దోమలను పారద్రోలుతాయి. పచ్చని తోరణాలు కంటికి, పూల పరిమళం మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. శుచీ, శుభ్రతల వలన ఆరోగ్యం, పూజా

పునస్కారాల వలన మానసిక ప్రశాంతత లభిస్తాయి. ఆయా కాలాల కనుగుణంగా చేసుకునే ప్రసాదాలు భుజించడమూ ఆరోగ్యదాయకమే. వినాయకుడిని పూజించే ఏకవింశతి పత్రాలు, గరికెలలోనూ ఎన్నో ఔషధ గుణాలున్నాయి. వీటి సుగుణాలన్నీ వాటిని తాకడం ద్వారా మనమూ పొందుతున్నాము. కనుక పండుగలు ఆరోగ్యరీత్యా కూడా మనకు మేలు చేస్తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలన్నీ మనకు ఉపయోగపడ్తున్నవే. వాటిని ఛాదస్తంగా భావించి తిరస్కరిస్తే నష్టపోయేది మనమేనమ్మా" అంటూ బామ్మ మాట్లాడటం ముగించింది.




బామ్మ చెప్పింది విని అక్కడున్న అందరితో బాటు బాచీ కూడా నిశ్చేష్టుడైపోయాడు. 'బామ్మలో ఎంత నాలెడ్జి దాగుంది! ఎంత కరెక్ట్‌గా చెప్పింది బామ్మ' అనుకున్నాడు.

ఆ తరువాత అందరూ "ఎంత బాగా చెప్పారంటూ" బామ్మపై ప్రశంసల వర్షం కురిపించేసారు. బామ్మ తను చేసిన ప్రసాదం అందరికీ పెట్టింది. ఇంత రుచికరమైన ప్రసాదాలు మేమెక్కడా తినలేదంటూ వారంతా బామ్మను మెచ్చుకున్నారు. అపార్ట్‌మెంట్ తరుపున నిలబెట్టిన వినాయకుడి పూజకు మీరు కూడా రావాలని వారు బామ్మకు మరీ మరీ చెప్పి వెళ్ళారు.

వాళ్ళలా వెళ్ళగానే "ఏమిటే, బామ్మా! భలేగా స్పీచ్ ఇచ్చావు, నీలో చాలా టాలెంట్ ఉందే" అని ప్రశంసిస్తూనే "నీకూ ఫ్రెండ్స్ సర్కిల్ పెరిగిపోతోందే" అన్నాడు బాచీ వేళాకోళంగా.

"అదేం కాదురా! ఇన్నాళ్ళూ ఈ ఇంట్లో మగపిల్లలే ఉన్నారనుకున్నారట. బైట ముగ్గు, తోరణాలు, గడపకు పసుపు ఉండటం చూసి వచ్చారట మనింటికి. మన దేవుడ్ని, అలంకరణని చూసి వాళ్ళెంత ఆశ్చర్యపోయారనుకున్నావు? నువ్వు స్నానానికి వెళ్ళావు గానీ, వాళ్ళు ఇంగ్లీషులో ఏవేవో అంటుంటే నాకేమీ అర్థం కాలేదు. ఇక్కడ ఎవరూ ఇంత పద్ధతిగా చేయరనో ఏదో అన్నార్రా అబ్బీ! ఏమోరా! ఎవరి ఓపిక వారిది, ఎవరి పద్ధతి వారిది. మెప్పుకోసం చేస్తామా, ఏమిటి? ఆ దేవుడ్ని మెప్పించగలిగితే అంతే చాలు" అంది బామ్మ దేవుడికి నమస్కరిస్తూ.



"అవును కానీ బామ్మా! ప్రొద్దుట్నుంచీ అడుగుదామనుకుంటున్నా.. నీకీ దేవుడి ప్రతిమ, పత్రి, పాలవెల్లి, ఛత్రం ఇవన్నీ ఎవరు తెచ్చిచ్చారే?" అన్నాడు కుతూహలంగా.

"అన్నీ ఆ దేవుడే సమకూర్చాడురా! పాలపాకెట్లు తెచ్చుకుందామని క్రిందకు వెళ్ళాను. అక్కడ వినాయకుడి విగ్రహం నిలబెడ్తున్నారు. బోల్డు పత్రి, పూలు పూజ కోసం తెప్పించారట. కావలిస్తే తీసుకువెళ్ళమని పూజారిగారే ఇచ్చారు. పూజా వస్తువులు ఉచితంగా తీసుకోకూడదు కదా అని సాయంత్రం దేవుడి పూజకు ప్రసాదం నేనే చేసి ఇస్తానని చెప్పాను. పళ్ళు ఇంట్లోనే ఉన్నాయి కదా..అటకమీదున్న వెదురు బుట్ట విప్పేసి పాలవెల్లి చేసాను. పాల తాలికల పిండితో వినాయకుడ్ని చేసాను. పూలబొకేకున్న కాగితం తీసి ఛత్రం తయారుచేసిపెట్టాను. నువ్వు వద్దు, వద్దు అన్నా ఏదీ ఆగలేదు. చూసావా! అంతా ఆ దేవుడి సంకల్పంతోనే జరుగుతుంది" అంది బామ్మ.

## భామా! ప్రియాంకా!

ఆడవాళ్ల కన్నా మగవాళ్లే గ్రేట్ అనుకుంటారు చాలామంది. కానీ మా ఆడవాళ్లే అన్ని విధాలా గ్రేట్ అంటుంది ప్రియాంకా చోప్రా. స్త్రీగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నాని చెప్పే ప్రియాంక ఇటీవల ఓ మెన్స్ షర్ట్స్ పబ్లిసిటీలో పాల్గొంది. 'మగవాళ్ల షర్టులకి నాలాంటి ఆడవాళ్లు ప్రచారం చేయడం ఏంటి అనుకుంటున్నారు కదా. కానీ మేం మగవాళ్లలా షర్టులూ, ట్రౌజర్లూ ధరించి తిరగ్గలం. కానీ మగవాళ్లు మాత్రం ఆడవాళ్లలా స్కర్టులు ధరించగలరా? అఫ్‌కోర్స్, ఒక్క స్కాట్‌లాండ్‌లో మినహా స్కర్టులు వేసుకునే మగాళ్లని చూపించండి' అంటూ ముసి ముసి నవ్వులు నవ్వింది ప్రియాంక.

"మాటల్లో పడి నీ మాటే మరిచాను. నువ్వు కూడా దేవుడికి దణ్ణం పెట్టుకుందువుగానీ రా" అంటూ దేవుడి దగ్గరకు బాచీని తీసుకు వెళ్ళి పూజ పూర్తి చేయించింది.

ఆ సాయంత్రం అపార్ట్‌మెంట్ తరుపున నిలబెట్టిన వినాయకుడి పూజ అనంతరం బామ్మకు ఘనసన్మానం చేసి, ఓ వెండి వినాయకుడిని బామ్మకు బహూకరించారు. బామ్మను చూసి అందరూ పండుగలనూ, సంప్రదాయాలను పాటించడమెలాగో నేర్చుకోవాలని ప్రశంసిస్తుంటే బామ్మ సిగ్గుతో ముడుచుకుపోయింది. ఓపిక చేసుకుని బామ్మతోబాటు క్రిందకు వచ్చినందుకు బామ్మకు జరిగిన సత్కారం బాచీకెంతో ఆనందం కలిగించింది. బామ్మ చేసిన పూజల ఫలితం అతనికి స్పష్టంగా కనిపిస్తోంది ఇప్పుడు.